


హైస్కూల్‌కి క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని అప్పనపల్లి హైస్కూల్లో 2001-2002లో పదవ తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు రూ.20 వేల విలువైన క్రీడా సామగ్రిని శుక్రవారం హెచ్‌ఎం బావరాజు సూర్య ప్రకాశరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు.



సామగ్రి అందజేస్తున్నఅప్పనపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

అంతర పంటగా కోకో సాగు లాభదాయకం

- కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్
- రైతులకు అవగాహనా సదస్సు



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ప్రజాశక్తి - అమలాపురం

కొబ్బరి తోటల్లో అంతర పంటలలో కోకో సాగు లాభదాయకమని అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉందని ఆ దిశగా సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లుకలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు కోకో సాగు విలువ ఆధారిత ఉత్పత్తులపై రైతులకు అవగాహనా సదస్సును ఉద్యాన శాస్త్రవేత్తలతో నిర్వహించారు. పంట సాగు యాజమాన్య పద్ధతులు దిగుబడులపై అవగాహన పెంపొందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోకో కొబ్బరి తోటలో అంతర పంటగా 50 శాతం పాక్షిక నీడలో పెరుగుతుందని దీనికి అంతర్జాతీయ మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉందన్నారు. ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా కాఫీ, టీ తరువాత ఎక్కువగా వినియోగించడం జరుగుతోందన్నారు. కొబ్బరి తోటల్లో కోకోను విరివిగా చాక్లెట్లు, పానీయాలలో మందులు, సౌందర్య సాధనాల తయారీలో పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారన్నారు. రానున్న ఏడాది సీజన్లో 1000 ఎకరాలు రెండో ఏడాది 2 వేల ఎకరాలు, మూడో ఏడాది 3 వేల ఎకరాలు విస్తీర్ణాలలో దశలవారీగా సాగును పెంచనున్నట్లు తెలిపారు. దక్షిణ అమెరికాలోని అమెజాన్ నదీ పరివాహక ప్రాంతంలో కోకో జన్మించినదన్నారు. ఉద్యాన శాఖ ఎకరాకు మొదటి ఏడాది మొక్కలు ఉచితంగా ఇవ్వడంతో పాటు రూ.4,800, రెండో ఏడాది రూ.1600 నిర్వహణ ఎరువులు మూడో ఏడాది నిర్వహణ కొరకు రూ.1600 సబ్సిడీగా అందిస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా లక్ష ఎకరాలలో కొబ్బరి సాగు ఉందని దీనిలో దశల వారీగా కోకో సాగును విస్తరించడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 2,400 ఎకరాల విస్తీర్ణంలో కోకో సాగు ఉందని దశలవారీగా తొలుతగా 10 వేలకు పెంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత ఐదు మాసాలుగా కోకో సాగు విస్తీర్ణంపై శాస్త్రవేత్తల సమన్వయంతో అధ్యయనం చేస్తారని ఆయన తెలిపారు. ఎకరాకు 200 మొక్కలు నిర్ణయించారని, ఈ యొక్క మొక్కల నర్సరీ పెంచేందుకు అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం నందు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొబ్బరి సాగు వల్ల గరిష్టంగా రూ.60వేలు ఆదాయం వస్తుందని కోకో సాగు వల్ల అదనపు ఆదాయం రూ.1 లక్షా 20 వేల సమకూరుతుందన్నారు. సమగ్రంగా ప్రాసెసింగ్ చేసిన యెడల మంచి ధర లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా పంట విస్తీర్ణం పెరిగితే విలువ ఆధారిత పరిశ్రమలు స్థానికంగా వచ్చేందుకు అవకాశాలు మెరుగవుతాయన్నారు. రైతులు తమ తమ కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకోని ఎంపిక చేసుకోవాలని సూచించారు. సమశీతోష్ణ వాతావరణం ఉన్న ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఆసియా దేశాలలో ముఖ్యంగా విస్తరించియున్నదన్నారు. కోకోసాగు వలన లాభాలున్నాయని శాశ్వత అంతర పంట 30 సం?లు అదనపు ఆదాయం లభిస్తుందని కలుపును శాశ్వతంగా, సమగ్రంగా నివారిస్తుందన్నారు. సాగులో ఉన్న రైతు రుద్రరాజు ప్రసాదరాజు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ చెట్ల ఆకులు రాలి దుక్కి ద్వారా భూమిలో కలిసి భూసారాన్ని పెంచుతాయని తద్వారా కొబ్బరిలో దిగుబడి కూడా పెరుగు తుందన్నారు. ఎండు ఆకులు రాలి, నేలలో తేమను కాపాడి ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించునన్నారు.నేల కొట్టుకుపోవటాన్ని అరికడుతుందన్నారు. కోకో కాయ డొప్పలు ఎరువుగాను వాడవచ్చునన్నారు. కోకో మొక్కలు నాటడానికి తగిన వాతావరణం, వర్షపాతం ఇసుకతో కూడిన ఎర్ర లేక నల్ల జిగురు నేలలు అనుకూలమైనవన్నారు. ఉప్పుచౌడు నేలలు పనికిరావన్నారు. నీడను నీటిని ఇష్టపడే ఈ కోకో మొక్కలకు 50 శాతం నీడ అవసరమన్నారు. కొబ్బరి ఆయిల్ ఫామ్ తోటలలో అంతరపంటగా నాటుకుని అధిక దిగుబడును సాధించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.కోకోను నాటడానికి అనుకూలమైన సమయం జూలై అక్టోబర్ నెలలన్నారు. రెండు కొబ్బరి వరుసల మధ్య ఒక కోకో వరుస వచ్చేటట్టు మొక్క లు నాటాలన్నారు. ఒక వరుసలోని రెండు కోకో మొక్కల మధ్యదూరం 10 అడుగులు ఉండాలని నెలల వయసు గల మొక్కలను నాటుటకు ఉపయోగిస్తారు. తగిన మోతాదులో ఎండిన పశువుల ఎరువును పై మట్టిలో కలిపి మొక్క నాటేటప్పుడు గుంతను నింపాలన్నారు. ఈ మొక్కలు నాటు సమయంలో వేర్లు చుట్టూ ఉండే మట్టి కదలకుండా పాలిథీన్ సంచిని బ్లేడుతో కోసి తీసివేయవలెను.ఆ మొక్కలు నాటిన తరువాత కర్రతో గాలికి వాలకుండా వదులుగా పురికొసతో కట్టవలెను. నేలస్వభావాన్ని బట్టి వారం నుంచి 10 రోజుల వ్యవధిలో నీటి తడులు క్రమం తప్పకుండా ఇవ్వవలెను. సాగు చేపట్టనున్న అభ్యుదయ రైతు ఎ.గోపాలకృష్ణ మాట్లాడుతూ గతంలో కోకో సాగు కొన్ని ఒడిదుడుకులకు గురైందని ప్రస్తుతం అంతర్జాతీయంగా దిగుబడులు తగ్గినందున స్థానికంగా డిమాండ్ పెరిగిందని తాను కూడా 18 ఎకరాలు విస్తీర్ణంలో సాగును చేపట్టనున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు, ఎస్‌బివి.చలపతిరావు, మమత, వెంకయ్యలు శాస్త్రీయంగా సాగు విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన పెంపొందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి, రైతులు, రైతు ఉత్పత్తుదారుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

26, 27న పోలింగ్ కేంద్రాలుగా నిర్దేశించిన విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు

ప్రజాశక్తి - అమలాపురం

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన భవనాల్లో పనిచేస్తున్న అన్ని విద్యాసంస్థలు , ప్రభుత్వ కార్యాలయాలకు పోలింగ్ ముందు రోజు (ఫిబ్రవరి 26), పోలింగ్ రోజు (ఫిబ్రవరి 27)న సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలుగా నిర్దేశించిన పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలలో పోలింగ్ సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులలో కలెక్టర్ ఆదేశించారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఇవే...

రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్‌మీడియేటరీ, స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 26న ఆయా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఎన్నికల పోలింగ్ సామాగ్రిని ఎన్నికల సిబ్బందికి అందజేస్తారు. అదే విధంగా పోలింగ్ పూర్తయిన అనంతరం ఎన్నికల సామగ్రి చేర్చేందుకు ఆయా ప్రాంతాల్లో రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి కాకినాడ కలెక్టరేట్‌లో, ఎఎస్ఆర్ జిల్లాకు సంబంధించి రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, రామచంద్రాపురం విఎస్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలో, కొత్తపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలు, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోను, ఏలూరు జిల్లాకు సంబంధించి వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో, జంగారెడ్డిగూడెంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని ఏలూరు జిల్లా వట్లూరులోని సిఆర్‌రెడ్డి కళాశాలకు తరలిస్తారు. ఏలూరు జిల్లా వట్లూరులోని సిఆర్ రెడ్డి ఇంజినీ రింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలు

కాకినాడ జిల్లా : కాకినాడ ఎంసి.లారిన్ హైస్కూల్, పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయం

ఎఎస్ఆర్ జిల్లా : రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆఫీసు, చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా : అమలాపురం అగ్రహారంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రామచంద్రాపురంలోని విఎస్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల, కొత్తపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పశ్చిమగోదావరి జిల్లా : భీమవరం, నర్సాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయాలు

తూర్పుగోదావరి జిల్లా : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల

ఏలూరు జిల్లా : ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం

రాఘవులు గెలుపు కోసం ఆటో ప్రచారం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యుటిఎఫ్ మండల శాఖ కోరింది. మండల, నగర పంచాయతీ పరిధిలో ఎంఎల్ సి అభ్యర్థి రాఘవులు విజయం కోరుతూ శుక్రవారం ఆటో ప్రచారాన్ని యుటిఎఫ్ మాజీ సీనియర్ నాయకులు రెడ్డి వీరస్వామి, నేరేడుమల్లి అబ్బులు ప్రారంభించారు. ఇరువురు నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలపై అవగహన ఉన్న రాఘవులు చట్ట సభలలో సమస్యలపై నిలదీసి పరిష్కారానికి కృషి చేసే సత్తా ఉందన్నారు. ఆయననుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. సమయం లేని కారణంగా ఆటో ప్రచారం యాత్ర ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘంసంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, యుటిఎఫ్ సీనియర్ నాయకులు వజ్రపు బాబాయి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, సిఐటీయూ మండల నాయకులు మాదే శీను బాబు, అనుసూరి లక్ష్మణరావు, కాశి సురేష్, దొమ్మేటి వీరరాఘవులు, మహమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్, సిఐటియు నాయకులు

బర్డ్ ఫ్లూపై అసత్య ప్రచారాలు నమ్మొద్దు


ప్రజాశక్తి - ఆలమూరు



వెటర్నరీ ఎడి డాక్టర్ అనిత

బర్డ్ ఫ్లూ పై దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మ వద్దని, పశు సంవర్ధక శాఖ ఎప్పటి కప్పుడు నిజా నిజాలు వెల్లడిస్తూ ఉంటుందని పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.అనిత తెలిపారు. పశుసంవర్ధక శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నాటు కోళ్లు, బాయిలర్, ఫారం కోళ్లలో ఎక్కడా బర్డ్ ఫ్లూ సోక లేదన్నారు. బర్డ్ ఫ్లూ అనేది జూనోటిక్ వ్యాధి కాదని, పక్షుల నుంచి మనుషులకు వ్యాపించడం ద్వారా మనుషులకు హాని చేసే వ్యాధి కాదని ఆమె వివరించారు. గుడ్లు, కోడి మాంసంను 75 డిగ్రీలకు ఉడికించి తినడం వల్ల ఎటువంటి వైరస్ అయినా చనిపోతుందని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో బర్డ్ ఫ్లూ పై తప్పుడు కథనాలు ప్రసారం చేయడం వల్ల కోళ్ళ పెంపకం దారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఒక్క బర్డ్ ఫ్లూ కేసు కూడా నమోదు కాలేదన్నారు. రాష్ట్రంలో పౌల్ట్రీ పరిశ్రమ అనపర్తి, మండపేట మండలాల్లో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కువగా వ్యాపించి ఉందని, బర్డ్ ఫ్లూ వ్యాధిపై దుష్ప్రచారాల వల్ల ఇప్పటికే పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. దుష్ప్రచారాలు పట్ల వినియోగదారులు అప్రమత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ భాను ప్రసాదరావు, డాక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది ఉన్నారు.


కార్టూ'నిజం'



మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

సిఐ ఆర్. భీమరాజు

ప్రజాశక్తి - అంబాజీపేట



సిఐ ఆర్.భీమరాజు

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పి.గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు ఆదేశాలతో కొత్తపేట డిఎస్‌పి బి.మురళీమోహన్ పర్యవేక్షణలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టామని సిఐ తెలిపారు. అయినవిల్లి స్టేషన్‌పరిధిలోలో మద్యం తాగి నడుపుతున్న 9 వాహనాలకు అమలాపురం కోర్టు 99వేలు జరిమానా విధించిందన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న సమయంలో రోడు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుండటంతో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టామ న్నారు. మైనర్‌లకు ద్విచక్ర వాహ నాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సిఐ భీమరాజు విజ్ఞప్తి చేశారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేర మన్నారు. మద్యం తాగి గ్రామాలలో అలజడులు సృష్టించే వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం పై సర్కిల్ పరిధిలో అన్ని స్టేషన్‌లలలో ఈగల్ స్క్వాడ్ పనిచేస్తుందన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం గ్రామపంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ పై జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి డ. శాంతలక్ష్మి శుక్రవారం డ్వాక్రా యానిమేటర్స్, పంచాయతీ సిబ్బంది కి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఎస్ డబ్ల్యుపిసి షెడ్ పరిశీలన, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో తడి పొడి చెత్త వేరు చేసే అంశం పై శిక్షణ నిర్వహించారు. గ్రామంలో ప్రజలందరికీ తడి పొడి చెత్త వేరు చేసే విధంగా వారికి అవగాహన కల్పించాలని తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి కె.శివ చక్రవర్తి, డ్వాక్రా యానిమేటర్స్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారిణి శాంతలక్ష్మి

జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - ఆత్రేయపురం

జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు మండలంలోని మెర్లపాలెం గ్రామం హై స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీహరి శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రెటరీ పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇటీవల రావులపాలెం డాన్ బాస్కో స్కూల్ నందు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇద్దరు మెర్లపాలెం విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని ఆయన పేర్కొన్నారు అండర్-19 జూనియర్ బాయ్స్ ఫాస్ట్ 5 విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న అత్తిలి హర్షవర్ధన వెంకటరమణ, జూనియర్ గర్ల్స్ ట్రెడిషనల్ విభాగంలో 9వ తరగతి చదువుతున్న బొలిశెట్టి ఇందు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.శ్రీకాంత్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23 తేదీ నుంచి హర్యానా రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎపి టీం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావటం పట్ల గ్రామ సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి, పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ పువ్వల లక్ష్మీనారాయణ నాగరాజు, మెర్లపాలెం గ్రామ టిడిపి ప్రెసిడెంట్ మల్లవరపు నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.



ఎంపికైన మెర్లపాలెం విద్యార్థులకు పలువురు అభినందనలు

ఇమామ్‌లకు గౌరవ వేతనం చెల్లింపుపై హర్షం

ప్రజాశక్తి - మండపేట

మసీదుల్లో విధులు నిర్వహిస్తున్న ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాన్ని చెల్లించడంపై టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఇమామ్, మౌజన్ లకు గౌరవ వేతనాలు ప్రభుత్వం చెల్లించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇవ్వాల్సిన గౌరవ వేతనంతో పాటు గత ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన ఆరు నెలల బకాయిలను సైతం చంద్రబాబు అందించాన్నారు. ఇందుకు సిఎం చంద్రబాబుకు, మైనార్టీ వ్యవహారాల ముఖ్య సలహాదారులు అహ్మద్ షరీఫ్, మంత్రి మహమ్మద్ ఫరూక్, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, సిఐఒ మహమ్మద్ అలీలకు ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ వైఖరిని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - మండపేట


విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ వైఖరిని అలవర్చుకోవాలని విద్యార్థులకు రామచంద్రపురం డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి పి. రామలక్ష్మణ మూర్తి సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో మండపేట మండలం, పట్టణస్థాయి సైన్స్ క్విజ్ పోటీలు స్థానిక వేగుళ్ళ సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో మండపేట శ్రీ గౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు వై. ప్రణీత, యువిఎన్ఎస్.ప్రజ్ఞలు ప్రథమ స్థానం పొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామచంద్రపురం డివిజనల్ ఉపవిద్యాశాఖ అధికారి పి.రామ లక్ష్మణమూర్తి, మండల విద్యాశాఖ అధికారి చింతా వెంకట సోమిరెడ్డిలు విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం నిర్వాహకులుగా పిఎస్ .టీచర్స్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు గండి స్వామి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాస్ వ్యవహరించారు.



మండపేటలో విజేతలకు బహుమతులు అందజేత

మండల స్థాయి క్విజ్ పోటీల్లో విజేతలు

మామిడికుదురు : మామిడికుదురు హైస్కూల్ లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ ఫోరం, జిల్లా సైన్స్ విభాగం సంయుక్తంగా, జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతితో, మండల స్థాయిలో 8వ, 9వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు ఎంఇఒలక్ష్మీనారాయణ, హెచ్‌ఎమ్ సిహెచ్.నిరంజనిప్రారంభించారు కరవాక హైస్కూల్ నుండి 8వ తరగతిలో కె.గోవిందరాజు, మామిడికుదురు హైస్కూల్ నుంచి 9వ తరగతిలో పి.చరణ్ కౌశిక్, పాశర్లపూడి హైస్కూల్ నుంచి 8 వతరగతిలో దురె షహవర్, 9వ తరగతిలో సిహెచ్.నవ్య కమలాశ్రీలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారన్నారు. వీరు ఈ నెల 25న ల్లా స్థాయిలో జరిగే క్విజ్ పోటీల్లో పాల్గొంటారని ఎంఇఒ తెలిపారు.



మామిడికుదురులో క్విజ్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంఇఒ

బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రతి విద్యార్థి రాజ్యాంగం కల్పించిన బాలికా సంరక్షణ చట్టాల పై అవగహన కలిగి ఉండాలని మాతా రామాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ పుణ్యమంతుల రజిని సూచించారు. మండలంలోని ఠానేలంక పంచాయతీ పరిధిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, అనాతవరం ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం బాలిక సంరక్షణ చట్టాల పై జరిగిన అవగాహనా సదస్సులో రజిని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో ఆడ పిల్లలపై జరిగే వివక్షతను తిప్పి కొట్టెందుకు బాలిక సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదే విధంగా కౌమర దశలో ఎదురయ్యే ప్రతి సవాళ్ళను దిటుగా ఎదుర్కొనేందుకు సంసిద్ధులు కావాలని, దీనికి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇచ్చే సలహాలు, సూచనలు తప్పక పాటించాలని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు జంగా తనూజ, ఈతకోట గౌరీ, తాళ్ల లలిత, విప్పర్తి లక్ష్మి సరస్వతి, గుర్రాల సుజాత, దేవరపల్లి సత్యా విద్యార్థినిలు పాల్గొన్నారు.



అవగాహన కలిగిస్తున్న రజిని

మెట్లకాలనీలో డ్రై డే

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట పిహెచ్‌సి పరిధిలో మాచవరం సచివాలయం-2 మెట్ల కాలనీలో శుక్రవారం డ్రై- ఫ్రైడే కార్యక్రమం నిర్వహించినట్లు సిహెచ్‌ఒ బి.అప్పారావు తెలిపారు. దోమల నిర్మూలనలో భాగంగా మురుగు గుంటల్లో మోటార్ సైకిల్ స్పీడ్ వేస్ట్ ఆయిల్ చుక్కలు వేశామన్నారు. ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా రాకుండా నిర్మూలించవచ్చునని అవగాహన కల్పించారు. సమీపంలో స్థానిక కాలనీలో బీపీ, షుగర్, థైరాయిడ్ పై కౌన్సిల్ గురించి అవగాహన కల్పించడమే కాకుండా బర్డ్ ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. టిబి లక్షణాలు ఉంటే కళ్ళ పరీక్షలు చేయించి అవసరమైన ముందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఎ(ఎం) డి.నాగేశ్వరరావు, ఎఎన్ఎం తులసి, ఆశా వర్కర్ అనంత కుమారి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిహెచ్‌ఒ బి.అప్పారావు




తీసుకువెళుతున్న ఎంఎల్ఎ బండారు దంపతులు

చింతలూరు వెంకన్నకు పట్టు వస్త్రాల అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరులో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ద్వితీయ పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు దంపతులు శుక్రవారం పట్టు వస్త్రాలు అందజేశారు. అనంతరం స్వామి వారిని, గ్రామంలో వేంచేసి ఉన్న నూకాంబిక అమ్మవారిని ఎంఎల్‌ఎ దంపతులు దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. ముందుగా ఎంఎల్‌ఎ దంపతులకు పూర్ణకుంభంతో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నూకాంబిక దేవస్థానం ఇఒ వీర్రాజు చౌదరి, మాజీ ఆలయ కమిటీ ఛైర్మన్ వైట్ల శేషుబాబు, నీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు, పారిశ్రామికవేత్త వట్టికూటి సతీష్ బాబు, నేతలు సలాది నాగేశ్వరరావు, దండంగి మమత రామారావు, పెద్దింటి కాశి దంపతులు తదితరులు పాల్గొన్నారు.



అన్నక్యాంటీన్‌లో భోజనంచేస్తున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలి

ప్రజాశక్తి - మండపేట

పేదలు అన్న క్యాంటీన్‌ను నమ్ముకునే జీవనం సాగిస్తున్నారని, ప్రజలందరికీ నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించేందుకు నిర్వాహకులు కృషి చేయాలని మండపేట ఎంఎల్ఎ, రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక అన్న క్యాంటీన్ ను శుక్రవారం ఆయన పరిశీలించారు. క్యాంటీన్ కు విచ్చేసిన పేదలతో కలసి ఆయన భోజనం చేశారు. ప్రతి రోజు భోజనాలు ఎలా ఉంటున్నాయో అక్కడ భోజనాలు చేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యతపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇదే నాణ్యతను కొనసాగించాలని ఆదేశించారు. అలాగే ఇక్కడ షెడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


ముమ్మిడివరంలో మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ముమ్మిడివరం: కళాసాహితి, లలిత కళల సేవా వేదిక ఆధ్వర్యంలో స్థానిక రవీంద్ర విద్యా సంస్థలు ముమ్మిడివరం నందు 'ప్రజ్ఞా శ్రీ' విత్తనాల వరప్రసాద రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బి.సాంబమూర్తి పాల్గొన్నారు. తెలుగు భాష పరిరక్షణ, మాతృభాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. వేమన పద్య పఠనం, తెలుగు భాష మాధుర్యంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పివిఎస్.వర్మ, రవీంద్ర విద్యా సంస్థల అధినేత లక్ష్మీ శ్రీనివాస్, కవిశ్రీ నాగేంద్ర, ఎవి ఎస్.మాస్టారు, గంజ శ్రీనివాసరావు, అబ్బులు మాస్టారు, పి.విజయ కుమార్, మట్ట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని చింతలూరు ప్రాథమిక పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు వుడతా వెంకటేశ్వరరావు, వాసా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మాతృభాషను చక్కగా నేర్చుకుంటే ఇతర భాషలను నేర్చుకోవడం సులువవుతుందని అన్నారు. మాతృభాష నేర్చుకోవడం, మాతృభాషలో చదువుకోవడం ద్వారా జ్ఞానం పెరుగుతుందని ఆధునిక పరిశోధనల ద్వారా తెలుస్తుందన్నారు. విద్యార్థులు మాతృభాష యొక్క గొప్పదనాన్ని తెలుసుకునేలా పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా తెలుగు భాష పరిణామక్రమాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఒక్కల దండ, ఒత్తుల గౌను తదితరాలతో తెలుగు లిపి పరిణామక్రమాన్ని విద్యార్థులకు తెలిపారు. అనంతరం విద్యార్థులు తెలుగు భాష పరిణామక్రమాన్ని వివరిస్తూ ప్రదర్శించిన కార్యక్రమాలు అలరించాయి.

మండపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శీనివాస రావు మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో మాతభాష పరిరక్షణకు యువత చేసిన బలిదానానికి గుర్తుగా యునెస్కో ఈ రోజు ను అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా జరపాలని తీర్మానించిందన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన తెలుగు పండితులు నక్కిన వీర రాఘవ రావు మాట్లాడుతూ నన్నయకు ముందు కాలం నుంచి నేటి వరకు తెలుగుభాష రూపాంతరం చెందుతుందని, మాతృభాష అంటే అది మన సంస్కృతి అని తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జి.సింహాచలం తెలుగు పద్యాలతో చేసిన ఏక పాత్రాభినయం విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ మధు, వైస్ ప్రిన్సిపల్ ఆనంద్, అధ్యాపకులు వెంకన్న, బాబూరావు, రామకృష్ణ, అభినయ్, చంటి, దిలీప్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.


మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవం

నేరాలు ఘోరాలు

ఏటిఎం కార్డు మార్చి రూ.26 వేల చోరీ

ప్రజాశక్తి - పిఠాపురం

ఏటిఎం కార్డును మార్చి అకౌంట్ నుంచి రూ26వేలు చోరీ చేశాడో వ్యక్తి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాధవపురం గ్రామానికి ఎం.త్రిమూర్తులు గురువారం ఉదయం మాధవపురం సెంటర్‌లో ఎస్‌బిఐ ఏటిఎం వద్దకు డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లారు. అక్కడ ఒక గుర్తు తెలియని వ్యక్తిని డబ్బులు డ్రా చేయమని అడిగారు. ఆ వ్యక్తి ఏటిఎం కార్డు తీసుకుని మిషన్‌లో పెట్టి డబ్బులు రావట్లేదని వెనకకు తీసి వేరొక ఏటిఎం కార్డు ఇచ్చేశాడు. అది గమనించని త్రిమూర్తులు మళ్లీ ఏటిఎంలో కార్డు పెట్టి పిన్‌ను ఎంటర్ చేయగా ర్యాంగ్ అని వచ్చింది. వెంటనే తన ఖాతా ఉన్న యూనియన్ బ్యాంక్ వెళ్లి వాకబు చేశాడు. ఆ కార్డు తనది కాదని సిబ్బంది ద్వారా తెలుసుకున్నాడు. అప్పటికే త్రిమూర్తులు ఎకౌంట్ నుంచి నాలుగు దఫాలుగా రూ.26వేలు డ్రా చేసినట్లు తెలుసుకుని వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న లారీ

మట్టి లారీల స్వాధీనం

ప్రజాశక్తి - రావులపాలెం

మండలంలో బొండు మట్టి అక్రమంగా తరలిస్తున్న లారీలను స్వాధీనం చేసినట్లు తహశీల్దార్ బియం. ముక్తేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండల స్థాయి టాస్క్ ఫోర్స్ నిర్వహించిన సాధారణ తనిఖీల్లో భాగంగా అక్రమంగా బొండు మట్టి తరలిస్తున్న మూడు లారీలను స్వాధీనం చేసుకొని జరిమానా విధించామని తహశీల్దార్ తెలిపారు. మండల స్థాయిలో ఇసుక, మట్టి, బొండు మట్టిని అక్రమంగా తరలించిన వారిపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామన్నారు.

స్వయం సహాయక సంఘాల ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీనదయాళ్ జన్ ఆజీవిక యోజన-పట్టణ ఉపాధి పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి స్వయం సహాయక పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి సమక్షంలో శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో విడుదల చేస్తామని తెలిపారు.


టివిని అందజేస్తున్న దాత సుబ్బారావు

వికలాంగుల పాఠశాలకు టివి అందజేత

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ వికలాంగుల పాఠశాలకు కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామానికి చెందిన మద్దాల సుబ్బారావు టివిని బహుకరించారు. పాఠశాల ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ టీవిని పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.సుశీల, కె.మహేశ్వరి, డి.వీరవేణి, దుర్గ, తాతారావు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న కార్మికులు

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - యానాం

అధికారుల నిర్లక్ష్యం వల్లే హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ పారిశుధ్య కార్మికులకు వేతనాలు రావడం లేదని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ కార్మికులపై మున్సిపల్ కమిషనర్ వివక్ష చూపిస్తున్నారన్నారు. 11 నెలలుగా జీతాలు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సంస్థపై తప్పుడు ఫిర్యాదులు మానుకోవాలని, తక్షణమే పెండింగ్ బిల్లులు సంస్థకు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

ఎంఎస్ఎల్ పాయింట్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని పౌర సరఫరాల ఎంఎస్ఎల్ పాయింట్‌ను ఆర్‌డిఒ కృష్ణనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంఎస్-ఎల్ పాయింట్ వద్ద ఉన్న బియ్యం స్టాక్‌కు సంబంధించి ప్రతి బస్తా 50 కేజీలు, గన్నీ బ్యాగు బరువు కాకుండా ఉండాలన్నారు. సాధారణంగా గన్ని బ్యాగు బరువు 580 గ్రాములు ఉంటుందని తెలిపారు. పరిశీలన సమయంలో కొన్ని బియ్యం బస్తాల బరువు 50 కేజీలు, 49.800 కేజీలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎంఎస్ఎల్ పాయింట్ నుంచి చౌక ధరల దుకాణాలకి పంపిణీ చేసే విధానంలో గన్ని బ్యాగు బరువు కాకుండా 50 కేజీలు ఉండాలని స్పష్టం చేశారు. బఫర్ స్టాక్ గోడౌన్ నుంచి తీసుకుని వచ్చే సందర్భంలో సరి చూసుకునే బాధ్యత ఎంఎస్ఎల్ పాయింట్ ఇన్‌ఛార్జిదేనని స్పష్టం చేశారు. ఆయన వెంట రూరల్ తహశీల్దార్ కుమార్, ఎంఎస్ఎల్ పాయింట్ ఇన్‌ఛార్జి డిటి.శ్రీనివాస్, పౌర సరఫరాల సంస్థ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కంటి వైద్య పరీక్షలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

అంధత్వ నివారణ సంస్థ ద్వారా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో కంటి వైద్య పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెసి టి.నిషాంతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సూర్య నగర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 425 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో దృష్టి లోపాలు గల 27 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ కార్యక్రమంలో జెసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అందత్వ నివారణ సంస్థ ద్వారా 83,942 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 3,300 మంది దృష్టి లోపాలు గుర్తించారన్నారు. వీరందరికీ ఉచితంగా కళా అద్దాలు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎ.హేమలత, డిఐసి మెడికల్ అధికారి డాక్టర్ పి.గీతిక, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.విజయ కుమారి, యుపిహెచ్ వైద్యాధికారి డాక్టర్ శిరీష, తహశీల్దార్ అశోక్ కుమార్, ఉపా ధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న జెసి టి.నిషాంతి

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులను విద్యాశాఖ అధికారి బి.శ్రీనివాసరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 58 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ఆరు రోజులపాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణ వారికి పునాదిలాంటిదన్నారు. అభ్యాసనను బలోపేతం చేయటం, పిల్లలు ఆటలు, పాటలు ద్వారా అభ్యాసన చేయడం, తలిదండ్రులకు సమాజం భాగస్వామ్యం, తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి నిర్మలకుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు హిమశ్రీ, ఫాతిమా, ట్రయినీ ఆర్‌పి కృష్ణకాంత్, బాపిరాజు, పాఠశాల జిహెచ్ఎం,వీరభద్రం, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న ఎంఇఒ

సైన్స్ క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రావులపాలెం

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎపిపిఎస్ టిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సైన్స్ క్విజ్ పోటీల్లో మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. 9వతరగతి విభాగం నుంచి గోపాలపురం జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి టి.సుబ్రహ్మణ్యం మొదటి స్థానం సాధించాడు. ఊబలంక ఉన్నత పాఠశాల విద్యార్థిని టి.నిహారిక ద్వితీయ స్థానానికి ఎంపికైంది. 8వ తరగతి విభాగం నుంచి రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి కె.తరుణ్ మొదటి స్థానం, రావులపాలెం బాలికల ఉన్నత పాఠశాల ఎ.జయశ్రీ రెండవ స్థానం సాధించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 25 జరిగే జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు, కోర్స్ సెంటర్ హెచ్ఎం కె.వీరభద్రం, నోడల్ జిహెచ్ఎం పి.శ్రీరామచంద్రమూర్తి, ఈతకోట జిహెచ్ఎం కెఎస్‌వి.కృష్ణారెడ్డి, క్విజ్ కో-ఆర్డినేటర్లు జి.ఇమ్మానుయేల్, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

చిందాడగరువులో శుక్రవారం 100 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక అమ్మ వాటర్ ప్లాంట్ ఆవరణలో లయన్ క్లబ్ సభ్యులు, జెజె.రావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లయన్ ఆరిగెల జంగా రాజేంద్ర కుమార్ సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రవణం వేణుగోపాల రావు ఆధ్వర్యంలో మెడ్ యునైటెడ్ హాస్పటల్ వారి పర్యవేక్షణలోఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో ఇసిజి, బిపి, బ్లడ్ షుగర్, కంటి పరీక్షలు సుమారు 100 మందికి పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 8 మందికి కంటి ఆపరేషన్ గుర్తించి వారిని కిమ్స్ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. 20 మందికి ఉచితంగా లయన్ క్లబ్ సభ్యుల సహకారంతో కళ్లజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ లయన్ అనిల్ కుమార్ జైన్, ఐ విజన్ ట్రెజరర్ లయన్ జంపన సుమన్ వర్మ, లయన్స్ క్లబ్ బిల్డింగ్ చైర్మన్ లయన్ సుగ్గ గోపి, లయన్ సుధా గణపతి, లయన్ గుత్తుల నాగేశ్వరరావు, ఇతర లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు, కిమ్స్ వైద్య సిబ్బంది, అయువు భరోసా ప్రోగ్రాం కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.



చిందాడగరువు లో నిర్వహిస్తున్న ఉచిత మెడికల్ క్యాంపు


డాక్టర్ ఎంజిఆర్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది

చదవుతోనే లక్ష్య సాధన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థులు చదువుతోనే లక్ష్యాన్ని చేరుకోగలరని విద్యాప్రదాత, ఎన్ఆర్ఐ, డాక్టర్ మోకా గణపతి రావు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను అమెరికా నుంచి వచ్చిన డాక్టర్ గణపతిరావు శుక్రవారం సందర్శించారు. కళాశాల డోనర్ అయిన డాక్టర్ గణపతి రావుకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. డాక్టర్ గణపతి రావు కళాశాల భవనాలను, మౌళిక సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన జరిగిన సత్కార సభలో డాక్టర్ ఎంజిఆర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జ్ఞాన తృష్ణ ను పెంపొందించుకోవడానికి నిరంతరం జ్ఞానపోరాటం చేయడం ద్వారా లక్ష్యాలను చేరుకోవచ్చునని దిశా నిర్దేశం చేశారు. తాను రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ సూచించిన "పే బ్యాక్ టు సొసైటీ"స్ఫూర్తితో 1982లో ఈ ప్రాంత వాసుల విద్య కొరకు కళాశాల స్థాపనకు నాంది పలికానన్నారు. ఈ కళాశాల ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులు విద్యానభ్యసించి ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారంతా విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ఎంజిఆర్‌ను కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు దుశ్శాలువా కప్పి, అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులతో పాటు కాశి మునికుమారి, జేమ్స్ పాల్ పాల్గొన్నారు.


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వందేళ్ల నాటి వృక్షానికి నిప్పు
మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని లయన్స్ కళ్యాణ్ మండపం వెనక గల మెయిన్ రోడ్ పై వంద ఏళ్ల నాటి వృక్షానికి నిప్పు అంటుకుంది. చెట్టు చుట్టూ గల చెత్తా గుట్టగా వేసి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు దానికి నిప్పంటించారు. వృక్షానికి నిప్పు అంటుకోవడంతో పొగ మంటలు వ్యాపించాయి. స్థానికులు, మున్సిపల్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే అది విఫలం కావడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. మండపేటకు చెందిన ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. మండపేట ఫైర్ ఆఫీసర్ జె.హనుమంతరావు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు.

మార్చి 6 లోగా గోడి గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - అల్లవరం

మండలం లోని అంబేద్కర్ గోడి గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి మార్చి ఆరో తేదీ లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎస్.కిరణ్మయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొనుటకు ప్రస్తుతం నాలుగవ తరగతి , పదవ తరగతి చదువుతున్న బాలికలు అర్హులన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని, దరఖాస్తు దారులు నేరుగా https:// aphragcet.apcfss.in వెబ్ సైట్ ద్వారా గాని, పాఠశాలలో గానీ దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వివరాల కోసం 99512 08586, 70936 49996 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

క్రైస్తవ వివాహ రిజిస్ట్రార్‌గా ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - అమలాపురం/ఆత్రేయపురం

రాష్ట్ర సమాచార పౌర సంబంధ శాఖలో వివిధ హోదాల్లో విశిష్ట సేవలు అందించి జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఫ్రాన్సిస్‌కు క్రైస్తవ వివాహ రిజిస్ట్రార్ గా లైసెన్సు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి కాటి హర్షవర్ధన్ శుక్రవారం జిఒ ఎంఎస్ 22 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ప్రకారం భారతీయ క్రైస్తవ వివాహ చట్టం 1872 ప్రకారం పది సంవత్సరాలు పాటు క్రైస్తవ వివాహాలు జరిపేందుకు లైసెన్సు మంజూరు చేశారు. ఆత్రేయపురం మండల కేంద్రంగా క్రైస్తవ వివాహ రిజిస్ట్రార్‌గా ఫ్రాన్సిస్ కు వివాహ లైసెన్స్ మంజూరు చేయడం పట్ల పలు క్రైస్తవ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఐదేళ్లలో కోటిపల్లికి రైలు కూత : ఎంపీ హరీష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

వచ్చే ఐదేళ్లలో కోటిపల్లికి రైలు కూత వినిపిస్తామని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్ తెలిపారు. రామచంద్రపుర లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా కోటిపల్లి -నరసాపురం రైల్వే లైన్ త్వరలోనే పూర్తి చేస్తామని, అలాగే కోటిపల్లి - ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి సాధిస్తామన్నారు. జిల్లా అభివద్ధికి తనతో పాటు మంత్రి సుభాష్ కూడా పూర్తి సహకారం అందిస్తున్నారని అన్నారు. ఇటీవల ఢిల్లీలోని కేంద్ర పెద్దలను కలిసి అభివద్ధికి నిధులు మంజూరు కు కషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఎన్నికల పరిశీలకులు కాకినాడ రామారావు, టిడిపి నాయకులు రేవు శ్రీను, బిజెపి నాయకులు కర్రి చిట్టిబాబు, దళిత నాయకులు, రవ్వ భూషణం, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు కవలల దినోత్సవం

ప్రజాశక్తి - కొత్తపేట

ఒకే గర్భం, ఒకే కాన్పులో ఇద్దరూ లేదా ఆపైన పుట్టిన పిల్లలను కవల పిల్లలు అంటారు. కవల పిల్లలను చూడగానే ఆనందంగా అనిపిస్తుంది. ఒకే రూపంతో ఇద్దరూ అపురూపంగా కనిపిస్తుంటారు. ఇక వీరి మాట, రూపు, కొన్ని కొన్ని చేష్టలు కూడా ఒకే విధంగా ఉంటాయి .ఒకే కాన్పులో ఇద్దరూ లేదా అంతకంటే ఎక్కువ మంది జన్మిస్తే వారిని కవలలు అంటారు. .ఫిబ్రవరి 22 జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా కొత్తపేటకు చెందిన గుబ్బల మూర్తి ఝాన్సీ దంపతులకు కవలలుగా జన్మించిన వర్షిని, వర్ధిని కవలల దినోత్సవాన్ని వారు ప్రత్యేకంగా భావించి ఆనందంగా జరుపుకుంటున్నారు. వర్షిని, వర్ధిని ఒకే రూపంలో ఉండటమే కాదు ఒకే రకమైన హావభావాలను కలిగి ఉంటున్నారు. ఒకరికి జ్వరం వచ్చినచో మరొకరికి కూడా ఆ వెంటనే జ్వరం వస్తుందని తల్లిదండ్రులు తెలిపారు. చదువులలోనూ రాణించి వారి ప్రతిభ కనబరుస్తూ వస్తున్నారు. వీరు అనుకున్న లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో మంచి ప్రయోజకులు కాగలరని ఆశిస్తూ కవలలకు హ్యాపీ ట్విన్స్ డే శుభాకాంక్షలు పలువురు తెలియజేశారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - అంబాజీపేట

జిల్లాలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలోనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని ఎస్‌పి బి.కృష్ణారావు అన్నారు. అంబాజీపేటలో ఏర్పాటు చేసిన పి.గన్నవరం సిఐ కార్యాలయాన్ని ఎస్‌పి శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రధాన కేంద్రమైన అమలాపురంలో ఈదరపల్లి, నల్లవంతెన, ఎర్రవంతెనల వద్ద ఉదయం, సాయంత్రం సమయాలలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటుకు ప్రతి పాదనలు సిద్ధం చేశామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. సైబర్ క్రైమ్ నివారణకు ప్రత్యేక పోలీసు బందాలు ఏర్పాటు చేశామని, సైబర్ నేరాలపట్ల ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన పెంచడంతో సైబర్ నేరాలు తగ్గాయన్నారు. నేర పరిశోధనలో సిసి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 2500 సిసి కెమెరాలు ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకు స్థానిక ప్రజలు, దాతల సహకారంతో 850 కెమెరాలు ఏర్పాటు చేశామని వీటితోపాటు 264 మ్యాట్రిక్స్ కెమెరాలు ఉండగా 40 రిపేర్‌లో ఉన్నాయన్నారు. 220 కెమె రాలు పనిచేస్తు న్నాయన్నారు. సమావేశంలో కొత్తపేట డిఎస్‌పి ఎస్. మురళీమోహన్, పి.గన్నవరం సిఐ ఆర్.భీమరాజు, ఎస్ఐ కె.చిరంజీవి, బి.శివకృష్ణ, ఎ.చైతన్య కుమార్, కె.మనోహర్ జోషి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌పి బి.కృష్ణారావు